# హిందూ నగారా

మాసపత్రిక

“ ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్నిబోధత”

కలియుగాబ్ది 5121

సంపుటి : 28 ❁ సంచిక : 5 ❁ పేజీలు : 8 ❁ విడిప్రతి : రూ.5.00 ❁ శ్రీ వికారి నామసంవత్సరం : వైశాఖమాసం : 01-05-2019


## బెంగాల్ ఇండియాలో ఉందా? పాకిస్తాన్లో ఉందా?

### హిందువులపై రోజు రోజుకీ పెరుగుతున్న అత్యాచారాలు. మమతా బెనర్జీ పాలనలో బెంగాల్ సురక్షితమేనా?

**మ**మతా బెనర్జీ పాలనలో బెంగాల్ సురక్షితమేనా? హిందువులపై రోజు రోజుకీ పెరుగుతున్న అత్యాచారాలు చూస్తుంటే బెంగాల్ ఇండియాలో ఉందా? పాకిస్తాన్లో ఉందా? అన్న అనుమానం కలుగక మానదు. పాకిస్తాన్లో ఇద్దరు బాలికలను అపహరించి, బలవంతంగా మతం మార్చి, వివాహం చేసుకున్న ఘటన మరువక ముందే సాక్షాత్తు భారత్‌లోని కొలకత్తాలో కూడా సరిగ్గా అలాంటి ఘటనే జరగడం గమనార్హం. ఈ విషయాన్ని “మై నేషన్” అనే వార్తా సంస్థ బైట పెట్టింది.

బెంగాల్‌లో ఒక మైనర్ బాలిక సహా ఇద్దరు బాలికలు అపహరణకు గురయ్యారు. వారిని బలవంతంగా మతం మార్చి వివాహం చేసుకున్నారు. మార్చి 11న ఈ ఘటన విషయమై బాలికల తండ్రి కేసు పెట్టారు. పోలీసుల వెతుకులాటలో ఇరువురిలో మైనర్ అయిన బాలిక ఆచూకీ తెలిసింది. ఆమెకంటే పెద్దదైన ఆమె సోదరి ఆచూకీ తెలియాల్సి వుంది. ఇంటికి చేరుకున్న మైనర్ బాలిక తన భయంకర అనుభవాన్ని వివరించింది.

తనను, తన అక్కను అపహరించిన వ్యక్తులు తమను వివాహం చేసుకోవాలని, లేకపోతే తమ తల్లిదండ్రులను చంపేస్తానని



బెదిరించారని, తమను తీవ్రంగా హింసించారని తెలిపింది.

“మై నేషన్” కథనాన్ని సుమోటోగా స్వీకరించిన జాతీయ మహిళా కమీషన్ ఈ అంశాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తూ పోలీసులను సత్వర చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశించింది. ★

## మిషన్ శక్తితో సత్తా చాటాం - డీఆర్డీవో ఛైర్మన్ సతీష్ రెడ్డి




**మి**షన్‌శక్తి పరీక్ష ప్రకటన అంశంపై డీఆర్‌డీవో ఛైర్మన్ సతీశ్‌రెడ్డి స్పందించారు. అంతరిక్షంలో ఉపగ్రహాన్ని కూల్చివేసేందుకు భారత్ చేపట్టిన ప్రయోగం ‘మిషన్ శక్తి’ కారణంగా మిగిలిపోయిన ఉపగ్రహ శకలాలు 45 రోజుల్లో ధ్వంసమవుతాయని సతీష్‌రెడ్డి పేర్కొన్నారు.

కాగా శత్రుదేశాల ఉపగ్రహాలు కూల్చేసేందుకు ఇటీవల భారత్ చేపట్టిన శాటిలైట్ విధ్వంసక క్షిపణి (ఏశాట్) పరీక్ష వల్ల అంతరిక్షంలో దాదాపు 400 వ్యర్థ శకలాలు ఏర్పడ్డాయని, ఐఎస్‌ఎస్‌ను వ్యర్థాలు ఢీకొనే ప్రమాదం 44 శాతం పెరిగిందని నాసా అడ్మినిస్ట్రేటర్ జిమ్ బ్రైడెన్‌స్టిన్ తెలుపగా, ఐఎస్ఎస్ భద్రతను దృష్టిలో పెట్టుకునే తమ టీమ్ ఈ ప్రయోగాన్ని చేపట్టిందని, 45 రోజుల్లోగా ఈ శకలాలు నాశనమవుతాయని సతీష్ రెడ్డి పేర్కొన్నారు. ★


## ఆరెస్సెస్ పై తప్పుడు ఆరోపణల కేసులో రాహుల్, ఏచూరిలకు కోర్టు సమన్లు

**జ**ర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్య విషయంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పై తప్పుడు ఆరోపణలు చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, CPI(M) పోలిట్ బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరిల నుంచి చెరో రూపాయి నష్టపరిహారం ఇప్పించవలసిందిగా RSS కోర్టును అభ్యర్థించింది.

2017, సెప్టెంబర్ 5వ తేది



జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్య జరిగిన తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ “బీజేపీ, ఆరెస్సెస్‌ల సిద్ధాంతానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారెవరైనా ఒత్తిడికి, భౌతిక దాడులకు, చివరికి హత్యలకు కూడా గురికావలసిందే” అని వ్యాఖ్యానించారు. సీతారాం ఏచూరి కూడా దాదాపు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అందుకే సర్దార్ వల్లభాయ్ పటేల్ కూడా ఆరెస్సెస్ ను నిషేదించారని ఏచూరి పేర్కొన్నారు. అయితే ఇవన్నీ అసత్యాలని, తమ పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలనీ పేర్కొంటూ ఆరెస్సెస్ కోర్టును ఆశ్రయించింది. పిటిషనర్ వాదనలు విన్న తర్వాత సివిల్ జస్టిస్ భాటియా ఏప్రిల్ 30న రాహుల్ గాంధీ, సీతారాం ఏచూరిలిద్దరూ కోర్టు ముందు హాజరు కావలసిందిగా ఆదేశిస్తూ ఇద్దరికీ సమన్లు జారీ చేశారు. ★



## తీవ్రవాద దాడిలో ఆరెస్సెస్ కార్యకర్త మృతి

**తీ**వ్రవాద దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జమ్మూ కాశ్మీర్ ఆరెస్సెస్ నేత చంద్రకాంత్ శర్మ మృతి చెందారు.

జమ్మూ కాశ్మీర్లోని కిస్త్వార్ జిల్లా ఆసుపత్రిలో సహాయ వైద్యాధికారిగా పనిచేసే చంద్రకాంత్ శర్మ ఆరెస్సెస్ జమ్మూ కాశ్మీర్ ప్రాంత సహ సేవా ప్రముఖ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న తీవ్రవాద ఏరివేత చర్యల్లో ప్రభుత్వానికి శ్రీ శర్మ చురుగ్గా సహకరిస్తున్నారు. ఆ కారణంగానే తీవ్రవాదులు ఆయనమీద దాడి చేశారు.

ఏప్రిల్ 9 ఉదయం జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలోకి చొచ్చుకు వచ్చిన ఒక సాయుధ తీవ్రవాది తమ విధులలో వున్న శ్రీ చంద్రకాంత్, ఆయన వ్యక్తిగత భద్రతాధికారి రాజేంద్రకుమార్లపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడు. ఈ దాడిలో రాజేంద్ర కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చంద్రకాంత్ శర్మ కూడా అదే రోజు సాయంత్రం మృతి చెందారు. ★

## నెత్తుటి మరకకు వందేళ్లు



**1**919 ఏప్రిల్ 13వ తేదీ అది..

సిక్కుల పవిత్ర దినం వైశాఖి సందర్భంగా పంజాబ్ అమృత్‌సర్‌లోని జలియన్ వాలా బాగ్‌లో వేలాది మంది సమావేశమయ్యారు.. బ్రిటిష్ పాలన దమననీతిని ఎండగడుతూ వక్తలు ప్రసంగిస్తున్నారు.. ఇంతలో జనరల్ డయ్యర్ 90 మంది సైనికులతో మైదానంలోకి వచ్చాడు. ఎలాంటి హెచ్చరికలు లేకుండా కాల్పులు ప్రారంభించారు. అక్కడి జనం తప్పించుకోడానికి కూడా వీలు లేకుండా పోయింది.

ఆ ఘోర ఘటనలో దాదాపు వేయి మంది మరణించారు. జలియన్ వాలాబాగ్ ఘటనపై దేశమంతా ఆగ్రహావేశాలతో రగిలిపోయింది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అత్యంత విషాదకరమైన రోజు అది. ఆ తర్వాతి కాలంలో ఉద్దాంసింగ్ అనే యోధుడు బ్రిటన్‌లో డయ్యర్‌ను కాల్చి చంపి ప్రతీకారం తీర్చుకున్నాడు.

జలియన్ వాలాబాగ్‌లో వందేళ్ల క్రితం అసువులు బాసిన మన దేశ ప్రజలను గుర్తు చేసుకుందాం.. వారి ప్రాణ త్యాగాలకు ఘనంగా నివాళి అర్పిద్దాం. ★

## తీవ్రవాదుల ఆర్థిక మూలాలపై ఈ'డీ'

**తీ**వ్రవాదుల ఆర్థిక మూలాలను నిలువుదల చేసే చర్యల్లో భాగంగా ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) కాశ్మీర్ కు చెందిన వ్యాపారవేత్త జహూర్ అహ్మద్ షా వటాలి

Directorate of Enforcement

కి చెందిన 6.19 కోట్ల ఆస్తిని జప్తు చేసింది. లష్కరే తోయిబా చీఫ్ హాఫిజ్ సయీద్ వంటి తీవ్రవాదులకు నిధులు సమకూరుస్తున్నారన్న ఆరోపణలతో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం (PMLA) క్రింద షాపై జాతీయ దర్యాప్తు సంస్థ NIA ఛార్జ్ షీట్ దాఖలు చేసి దర్యాప్తు చేస్తోంది.

హురియత్ కాన్ఫరెన్సు మరి కొన్ని ఇతర సంస్థలు కూడా పత్రికా సమావేశాలు, సోషల్ మీడియా సాయంతో యువకులను రెచ్చగొట్టి కాశ్మీర్ లోయలో సమ్మెలు, సాయుధ దళాలపై రాళ్ళ దాడులు వంటి భారత వ్యతిరేక చర్యలకు స్థానిక యువతను పురిగొల్పుతున్నట్లుగా విచారణలో తెలియవచ్చింది.

ED కూడా NIA దాఖలు చేసిన ఛార్జ్ షీట్ ఆధారంగా లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ పై చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం (UAPA ,1967) ప్రకారం చర్యలు తీసుకునేందుకు సిద్ధపడుతున్నారు. ★

## తృణమూల్ ప్రచారంలో బంగ్లాదేశ్ నటులు, దీదీ ఏమిటిది?



**సా**ర్వత్రిక ఎన్నికల వేళ పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ ప్రచార పర్వంలో బంగ్లాదేశ్‌కు చెందిన నటీ నటులు పాల్గొంటూ వుండడం తీవ్ర వివాదాంశంగా మారుతోంది.

సోమవారం నాడు బంగ్లాదేశీ నటుడు ఫిర్దోస్ అహ్మద్ రాయగంజ్ లో జరిగిన తృణమూల్ కాంగ్రెస్ నిర్వహించిన రోడ్ షోలో పాల్గొని ఆ పార్టీ తరపున ప్రచారం నిర్వహించారు. ప్రాంతీయ విదేశీ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఇచ్చిన నివేదిక ప్రకారం దీనిపై విచారణ జరిపిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ బంగ్లాదేశ్ నటుడు ఫిర్దోస్ వీసాను రద్దు చేసి ఆయనను దేశం విడచి వెళ్లవలసినదిగా ఆదేశించింది.

అదే రోజు ఫిర్దోస్ లాగే టెలి సీరియల్ నటుడు గాజీ అబ్దున్ నూర్ కూడా తృణమూల్ అభ్యర్థి సౌగతా రాయ్ తరపున తృణమూల్ సీనియర్ నాయకుడు మదన్ మిత్రాతో కలిసి ప్రచారం నిర్వహించారు.

దీనిపై ప్రత్యర్థి BJP, ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేయగా తృణమూల్ మాత్రం యదావిధిగా తమ చర్యలను సమర్థించుకుంటోంది. దీనిపై మదన్ మిత్రా మాట్లాడుతూ "నాకు తెలిసినంత వరకు విదేశీయులెవరూ ఎన్నికలలో పోటీ చెయ్యకూడదు. కానీ ప్రచారం ఎవరైనా నిర్వహించవచ్చు. కనుక ఇది ఎన్నికల నియమావళి ఉల్లంఘన క్రిందికి రాదు." అని చెప్పుకొచ్చారు. ★

# మతఛాందసాన్ని మట్టుబెడదాం

**మ**ళ్ళీ అవే పేలుళ్ళు.. మళ్ళీ అదే హింస.. అదిగో మళ్ళీ అదే రక్తపాతం.. ఆర్తనాదాలు, ఆక్రందనలు, రోదనలు.. మళ్ళీ మళ్ళీ అదే దృశ్యం. ప్రపంచంలో ఎప్పుడూ... ఎక్కడో ఓ మూల అదే రక్తపాతం. మొన్న ముంబైలో, నిన్న అమెరికాలో, ఇంతకు ముందు పుల్వామాలో, మళ్ళీ న్యూజిలాండ్‌లో, ఇప్పుడు శ్రీలంకలో. బాధితులు హిందువులా? ముస్లిములా? క్రైస్తవులా? ఎవరైతేనేం మనుషులు.

మనిషికి మనిషే శత్రువు. సింహం సింహాన్ని వేటాడదు. పులి పులిని వేటాడదు. కానీ మనిషే మనిషిని వెంటాడి, వేటాడి, వధించి ఆనందం, రాక్షసానందం పొందుతున్నాడు. నరుడే రాక్షసుడౌతున్నాడు. ఎందుకు? పదవులా? ధనమా? సంపదలా? కాదు. మతం. అవును మతమే మనుషుల పాలిట శాపమౌతోంది.

''మా మతమే మిన్న. మా దేవుడే నిజమైన దేవుడు. మా మార్గమే మోక్షాన్నిస్తుంది. మిగిలిన దేవుళ్ళు సైతానులు. వారి భక్తులు కాఫిర్లు. ఈ నమ్మకమే, ఈ విశ్వాసమే, ఈ సిద్ధాంతమే మానవ జీవితాల్ని కల్లోల భరితం చేస్తోంది. అవును ఈ స్వభావమే ప్రపంచాన్ని కబళించాలని చూస్తున్నది. ఆ మౌఢ్యమే చరిత్రను రక్తసిక్తం చేసింది. ఆ ఛాందసమే విజ్ఞాన ఖనియైన విశ్వవిద్యాలయాలను అగ్నికి ఆహుతి చేసింది. ఆ వికృత మనస్తత్వమే వందలాది మానవతుల మానాల్ని హరించింది. ఆ రాక్షస ప్రవృత్తే కత్తితో ప్రపంచాన్ని శాసించాలని మత యుద్ధాలు చేసింది. ఆ క్రూరత్వమే వేలాది ప్రార్థనా మందిరాలను నేల కూల్చింది. వాటిలోని పవిత్ర మూర్తులను ముక్కలు చేసి వికటాట్టహాసం చేసింది.

ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ "ఎక్కడో ఏ మూలో ఏదో జరుగుతోంది. మనదాకా రాలేదుగా?" అని మానవాళి మిన్నకుండిపోయింది. కానీ అది నిజం కాదు. ఆ మత రక్కసి ఆకలి అంతులేనిది. హద్దులెరుగనిది. ఈ సత్యాన్ని యావత్ప్రపంచం గుర్తించాల్సిన తరుణం ఆసన్నమైనది. "తీవ్రవాదానికి మతం లేదండీ" అని నంగనాచి కబుర్లు చేప్పే సెక్యులర్ తుంగబుర్రలు వాళ్ళ బుర్రలకు పట్టిన బూజు వదిలించి కళ్ళు తెరిచి నిజాన్ని చూడాలి.

**సంపాదకుని నగారా**

**"తీవ్రవాదానికి మతం లేదండీ" అని నంగనాచి కబుర్లు చేప్పే సెక్యులర్ తుంగబుర్రలు వాళ్ళ బుర్రలకు పట్టిన బూజు వదిలించి కళ్ళు తెరిచి నిజాన్ని చూడాలి.**

ఎక్కడ ఏ మూల నరమేధం జరిగినా అందుకు కారణం కరుడుగట్టిన మతఛాందస వాదం. అందుకు కారణం తమ మతమే మిన్న అని, మత వ్యాప్తికి కృషి చెయ్యడమే తమ దైవం పట్ల తాము ప్రకటించే విశ్వాసానికి కొలబద్ధయని, తమ దైవాన్ని కొలవని వారు, తమ మతాచారాలను ఆచరించని వారు పాపులని, కాఫిర్లని, దైవ ద్రోహులని బోధించే ఆయా మత గ్రంథాలు అవునా? కాదా? దీనిపైన ఆమూలాగ్ర చర్చ జరగాలా? వద్దా?

ఎన్నాళ్ళయినా, ఎన్నేళ్ళయినా సమస్యను పైపైన చూస్తూ, ఎక్కడో ఏ మూలో ఏ దుర్ఘటనో జరిగినప్పుడు రెండు కన్నీటి బొట్లు రాల్చి, రెండు నిమిషాలు మౌనం వహించి, రెండు కొవ్వొత్తులు వెలిగించి మన బాధ్యత తీరిపోయిందనుకుని ఆనక మునుగుదన్ని నిద్దరోదామా?

చేయి చేయి కలపలేమా? అడుగు అడుగు కలిపి వెయ్యలేమా? ఉగ్రవాద మన్నది ప్రపంచంలో ఏ మూల, ఏ రూపంలో ఉన్నా సమూలంగా తుద ముట్టించలేమా? విద్యాలయాల్లో, ప్రార్థనాలయాల్లో తీవ్ర మత బోధనలు చేసి, యువతలో తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్న వారిని, వారికి అండదండలందిస్తున్న వారిని నిర్దాక్షిణ్యంగా అంతం చెయ్యాల్సిందే.

ఆ రాక్షసత్వానికి, ఆ మౌఢ్యానికి మనం శాంతి సందేశాలతో సమాధానం చెప్పలేం. కర్కశమైన ఉక్కు పాదమే దానికి తగిన సమాధానం. ఈ బృహత్కార్య సాధనకు యావత్ప్రపంచం నడుం బిగించాలి. తీవ్రవాదాన్ని సమైక్యంగా, సంఘటితంగా ఎదుర్కోవాలి. శాంతి పతాకం ఎగరెయ్యాలి. ★

## నెలకో పద్యం

**ఒకచో నేలను బవ్వళించు నొకచో నొప్పారు బూసెజ్జపై**
**ఒకచో శాకములారగించు నొకచో నుత్కృష్ట**
**శాల్యోదనంబు**
**నొకచో బొంత ధరించు మరియొక్కొక్కతరిన్**
**యోగ్యాంబర శ్రేణి**
**లెక్కకు రానీయడు కార్య సాధకుడు దుఃఖంబున్**
**సుఖంబున్ మదిన్ !**

భావం: కార్యసాధకుడు ఒకసారి నేలమీద నిద్రిస్తాడు. మరొకసారి పూల పాన్పుపై శయనిస్తాడు. ఒకసారి కేవలం కంద మూలాదులతో కడుపు నింపుకుంటాడు. మరొకసారి శ్రేష్టమైన పిండి వంటలు ఆరగిస్తాడు. ఒకసారి అతుకుల బట్టలు ధరిస్తే, మరొకసారి మంచి పట్టు వస్త్రాలు ధరిస్తాడు. కార్యసాధకుడైన వాడు కష్టాలను, సుఖాలను, దుఃఖాలను, ఆనందాలను తన మనసులోనికి రానీయడు.

## మంచిమాట

ఏ వ్యక్తి అయితే తానున్న కాలాని కంటే సుదూరమైన భవిష్యత్తులోకి తొంగి చూడగలిగి దానికి తగినట్టుగా ఆలోచించి పని చేస్తాడో అటువంటి వారు మాత్రమే గొప్ప కార్యాలు సాధించగలుగుతారు.

**–స్వామి వివేకానంద**



## కలం నగారా

పశ్చిమాన సూరీడు మొలచినా
పున్నమి చంద్రుడు నిశిని రాల్చినా
దిక్కులన్నియును ఒక్కటై అయినా
చుక్కల గుంపులు నేలను దిగినా
ఋతువులన్నియును గతులు తప్పినా
కుత్తుకలన్నీ కత్తుల దెగినా
గుండె గుండెలో ఒకటే నాదం
గొంతు గొంతులో ఒకే నినాదం
భారత్ మాతాకీ జయ్... భారత్
మాతాకీ జయ్...
భారత్ మాతాకీ జయ్...

**–శ్రీరాంసాగర్**



ప్రేరణ

# కరణ్ సింగ్ ' శుభ్రక్ '

కుతుబుద్దిన్ ఐబాక్..

బానిస రాజవంశం యొక్క మొట్టమొదటి పాలకుడు..ఇతని మరణం గురించి చరిత్రలో చెప్పేది పోలో ఆడుతూ గుర్రం నుండి ప్రమాదవశాత్తు పడిపోవటంతో మరణించాడు అని పుస్తకాల్లో రాశారు..కానీ మొదటిసారిగా 11 ఏళ్ళ వయసులో గుర్రాన్ని నడిపిన ఒక యుద్ధోన్మాది మరియు గుర్రాల స్వారీపై లెక్కలేనన్ని యుద్ధాలు చేసి అక్రమంగానో సక్రమంగానో విజయాలు సాధించిన ఒక వ్యక్తి నడుస్తున్న గుర్రం నుండి పడి చనిపోయాడు అంటే ఎలా నమ్ముతాము?

ముస్లిం చరిత్రకారులూ కాంగ్రేస్ కమ్మీల సంయుక్త రాతగాళ్ళూ మనల్ని తప్పు దోవపట్టించారు..

కానీ నిజానికి జరిగిన చరిత్ర ఇదీ...

కుతుబుద్దీన్ ఐబాక్ మేవార్ రాజును హతమార్చి రాజపుతానాను దోచుకున్నప్పుడు యువరాజు కరణ్ సింగ్‌ను ఖైదు చేశాడు. మరియు దోపిడీ సంపదతో పాటు యువరాజు ప్రేమగా పెంచుకునే ప్రిన్స్ గుర్రం 'శుభ్రక్' ను కూడా తనతో లాహోర్ తీసుకువెళ్లాడు.లాహోర్లో సమయం చూసి రాకుమారుడు పారిపోవాలని ప్రయత్నం చేశాడు కానీ దురదృష్టవశాత్తు ఐబక్ సైనికులకు దొరికిపోయాడు.. దొరికిన రాకుమారుడు కరణ్ సింగ్ తలను బహిరంగంగా నరికి ఆ తలతో గుఱ్ఱము మీద కూర్చొని పోలో ఆడాలని, తద్వారా రాజపుత్రులను, హిందువులను భయభ్రాంతులకు గురిచేయాలని భావించాడు కుతుబుద్దిన్ ఐబక్.

శిరస్త్రాణం ధరించి రాకుమారుడి గుర్రం శుభ్రక్‌పై మైదానానికి చేరుకున్నాడు.మెల్లగా మైదానంలోకి ప్రవేశించిన శుభ్రక్ దూరంగా సంకెళ్లతో నిలబడ్డ తన యజమాని కరణ్ సింగ్‌ను తక్షణమే గుర్తించింది.ఆ క్షణంలో కరణ్ సింగ్ అవమాన భారంతో తలదించుకుని మౌనంగా కన్నీళ్లు కారుస్తున్నాడు.

తన ప్రియమిత్రుడు, యజమాని అయిన కరణ్ సింగ్ దుస్థితిని గమనించిన శుభ్రక్ తన యజమానికి ఏం జరుగబోతున్నదో ఊహించింది..ఒక్కసారిగా ఆగ్రహంతో ఊగిపోయింది. రెండు కాళ్ళు గాల్లోకి లేపి తనమీద కూర్చున్న కుతుబుద్దీన్ ఐబక్‌ను కిందపడేసి తన బలమైన గిట్టలతో ఛాతీ మీద మొహం మీద శక్తివంతంగా తాడనం చేసి వాడు మరణించాడు అని రూఢీ చేసుకున్న తర్వాత మెరుపులాగా తన యజమాని కరణ్ సింగ్ వద్దకు పరుగెత్తుకు వెళ్లి అతను తనమీద అధిరోహించడానికి వీలుగా నేలమీద సాగిలపడి రాకుమారుడు తనను అధిరోహించగానే మేవార్ రాజ్యం వైపు పరుగులు తీసింది..

శుభ్రక్ తన జీవితంలో అత్యంత కష్టమైన ప్రయాణాన్ని ప్రారంభించింది..

ఈ సంఘటన చూస్తున్న ప్రతివ్యక్తి ట్రాన్సడిపోయి చూస్తుండగానే లాహెూర్‌ను దాటివేసింది..షుమారు 600 కిలోమీటర్లు ఆగకుండా పరుగెడుతూ మేవార్ సామ్రాజ్యం యొక్క ద్వారాల వద్ద నిలిచింది..

రాకుమారుడు పూర్తి గాయాలతో అలసటతో ' శుభ్రక్ ' మీద నుండి దిగినప్పుడు 'శుభ్రక్' ఒక విగ్రహంలాగా నిలబడి పోయింది..

కిందకు దిగిన కరణ్ సింగ్ ప్రేమతో కృతజ్ఞతతో శుభ్రక్ తలపై తన చేతులను ప్రేమగా వేసి నిమురుతూ ప్రేమగా ముద్దిడినప్పుడు యజమాని కళ్ళలోకి చూస్తూ తన పని పూర్తి అయిందని అర్థం చేసుకొని తన అంతిమ శ్వాస వదిలి భూమాత ఒడిలోకి జారిపోయింది. మనం చాలా సార్లు చేతక్ గురించి చదివాము కానీ ఈ ' శుభ్రక్ ' కథ విశ్వాసానికి పరాకాష్ట.. ★

## ఉగ్రదాడులకు రెండు గంటల ముందే శ్రీలంకను హెచ్చరించిన భారత్

శ్రీలంకలో చోటు చేసుకున్న వరుస పేలుళ్లు, ఆత్మాహుతి దాడులతో శ్రీలంక దద్దరిల్లిపోయింది. ఈ పేలుళ్ల మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూనే ఉంది.శ్రీలంకలో ఈస్టర్ పండుగ సందర్భంగా చర్చిల్లో ప్రార్థనలు చేసుకుంటున్న క్రైస్తవులపై, హెూటళ్లలో ఉన్న పర్యాటకులపై ఉగ్రవాదులు పంజా విసరడం తెలిసిందే. సుమారు ఎనిమిది చోట్ల పేలుళ్లు జరగ్గా 320 మందికి పైగా మ ృతి చెందారు. 450 మంది వరకు క్షతగాత్రులయ్యారు. మృతులలో ఎనిమిది మంది భారతీయులు ఉన్నట్టు గుర్తించారు. మరోవైపు, 40 మంది అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే, ఈ దాడులకు ముందే



శ్రీలంకను భారత్ హెచ్చరించింది. కొలంబోలోని ఓ చర్చిలో తొలి దాడి జరగడానికి సరిగ్గా రెండుగంటల ముందు భారత నిఘా సంస్థ శ్రీలంక అధికారులతో తన వద్ద ఉన్న సమాచారాన్ని పంచుకుంది. చర్చిలు, ఇతర ప్రార్థన స్థలాలపై దాడులు జరిగే అవకాశం ఉందని భారత్ హెచ్చరించినట్టు శ్రీలంక రక్షణ శాఖ వర్గాలు అంగీకరించాయి. అంతేకాదు, అంతకుముందు రోజు రాత్రి కూడా అప్రమత్తంగా ఉండాలంటూ భారత్ నుంచి సందేశాలు వచ్చినట్టు శ్రీలంక వర్గాలు తెలిపాయి. అయితే, భారత్ హెచ్చరికలను పట్టించుకోకపోవడంతో శ్రీలంక భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. ★

## బాలికపై లైంగిక వేధింపుల కేసులో తెలుగు క్రైస్తవ పాస్టరుకు అమెరికాలో శిక్ష

తెలంగాణ రాష్ట్రానికి చెందిన క్రైస్తవ మతబోధకుడికి అమెరికాలో జైలుశిక్ష పడింది. ఇటుకలపాటి జాన్ ప్రవీణ్ (38) సౌత్ డకోటా ప్రాంతం ర్యాపిడ్ సిటీ నగరంలోని తమ చర్చికి వచ్చే ఓ 13 ఏళ్ల బాలికను లైంగికంగా వేధించినట్టు అక్కడి న్యాయస్థానం నిర్ధారించింది. దీంతో క్రైస్తవ బోధకుడు జాన్ ప్రవీణ్‌కు కోర్టు ఆరేళ్ల జైలుశిక్ష విధించింది.

జాన్ ప్రవీణ్ 10 ఏళ్ల ప్రత్యేక ఒప్పందం మీద 2017లో అమెరికాలోని ర్యాపిడ్ సిటీ చర్చిలో మతబోధకుడిగా పనిచేసేందుకు తెలంగాణ నుంచి వెళ్లాడు. అయితే, చర్చికి వచ్చే బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడడంతో అతడిపై కేసు నమోదైంది.



విచారణ సందర్భంగా ప్రవీణ్‌కు ఏడాది జైలు శిక్ష విధించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజ్ఞప్తి చేయగా, ఆ శిక్ష సరిపోదంటూ న్యాయమూర్తి స్టీఫెన్ మాండల్ ఆరేళ్ల కారాగార శిక్ష విధించారు. అతడు రిమాండ్ లో ఉన్న 178 రోజులు కూడా శిక్షాకాలం కిందకు వస్తుందని స్పష్టం చేశారు. పోలీసుల దర్యాప్తులో క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ గురించి మరో నిజం కూడా బయటపడింది. మరో 16 ఏళ్ల అమ్మాయితో కూడా లైంగిక కార్యకలాపాలకు పాల్పడినట్టు ర్యాపిడ్ సిటీ పోలీసులు గుర్తించారు.

తీర్పు పట్ల బాధిత బాలిక కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పు తమ బాలిక పడిన మనోవేదన నుంచి ఆమెకు స్వాంతన చేకూరుస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ★



## మశీదులలో మహిళలకు ప్రవేశం ఎందుకు ఉండకూడదు? : కేంద్రానికి సుప్రీం నోటీసులు

మహిళలను మసీదులోకి అనుమతించకపోవడం రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందని సుప్రీంకోర్టు తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,15,21,25,29లను ఉల్లంఘించినట్లు అవుతుందని కోర్టు తెలిపింది. దీనిపై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం, వక్ఫ్‌బోర్డు, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. మహిళలకు మసీదులోకి ప్రవేశం కల్పించాలని కోరుతూ సుప్రీం కోర్టులో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం పిల్‌ను మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేసింది. జస్టిస్ ఎస్ఏ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిల్‌ను విచారణ చేసింది. ఈ సందర్భంగా శబరిమల ఆలయంలోకి మహిళలకు ప్రవేశం కల్పిస్తూ ఇచ్చిన తీర్పును ధర్మాసనం ప్రస్తావించింది. మసీదులోకి, ఆలయంలోకి, చర్చిలోకి ప్రవేశించాలంటే ఒకరి అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించింది. ఇక్కడే రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయని పేర్కొంది. ఈ పిల్‌ను ముస్లిం సామాజిక వర్గానికి చెందిన యస్మీన్, జుబేర్ దంపతులు దాఖలు చేశారు. ★

## అనంత ప్రజల దాహార్తి తీరుస్తున్న సేవా భారతి

గత ఐదేళ్ళ కాలంలో వర్షాలు లేక అనంతపురం జిల్లా ప్రజల పరిస్థితి దయనీయంగా వుంది. జిల్లా అంతటా కరువు తాండవిస్తోంది. మిగిలిన అవసరాల సంగతి దేవుడెరుగు. కనీసం దాహమేస్తే గొంతు తడుపుకోవడానికి కూడా గుక్క నీరు లేక ప్రజానీకం విలవిలలాడిపోతున్నారు. కడివెడు నీటి కోసం మైళ్ళ కొద్దీ నడవాల్సిన పరిస్థితి. ఉన్న వారు ట్యాంకర్లతో నీరు తోలించుకుంటున్నారు. మరిలేని వారో? "గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీరు ఎక్కడ దొరుకుతుందా?" అని గంపెడాశతో ఎదురు చూడాల్సిన పరిస్థితి. అలాంటి వారికి మేమున్నామని ఆపన్న హస్తం అందిస్తున్నారు సేవా భారతి కార్యకర్తలు. అనంతపురం జిల్లా కదిరి మండల సేవాభారతి కార్యకర్తలు ట్యాంకర్లతో గ్రామాలకు ఉచితంగా నీటిని అందిస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. గ్రామాలలో వారి ఇళ్ళ వద్దకే వెళ్లి గ్రామీణులకు నీరందిస్తున్నారు.

సేవా భారతి అందిస్తున్న ఈ సాయానికి ప్రజలు తమ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ళకోసారి వచ్చి కల్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు దండుకుపోయే రాజకీయ నాయకులకన్నా, నిరంతరం సామాన్యుల సేవలో మునిగి వుండే సేవాభారతే తమను ఇలాంటి సందర్భాలలో ఆదుకుంటూ వున్నదని, విద్య, వైద్య సేవలను కూడా సేవాభారతి తమకు అందిస్తూ వున్నదని ప్రజలు కొనియాడుతున్నారు.

ఈ ఉచిత మంచి నీటి సరఫరా కార్యక్రమాన్ని త్వరలో జిల్లా అంతటా చేపట్టనున్నామని, జిల్లాలో మంచినీటి



కొరత వున్న ప్రాంతాలను గుర్తించే పనిలో ఉన్నామని సేవా భారతి సహ ప్రాంత ప్రముఖ్ శ్రీ కొండారెడ్డి తెలిపారు. ★

# ఆరెస్సెస్ శాఖలో ఆటల ద్వారా సద్గుణ వికాసం జరుగుతుంది–ప్రధాని మోడీ

**ఈ** మధ్య ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ప్రధాని నరేంద్ర మోడీని ఇంటర్వ్యూ చెయ్యడం అందరికీ తెలిసిందే. ఆ ఇంటర్వ్యూలో భాగంగా అక్షయ్, మోడీల మధ్య ఒక ఆసక్తికరమైన చర్చ జరిగింది. మీరు చిన్నతనంలో ఎలాంటి ఆటలు ఆడేవారు? అని అక్షయ్ అడిగినపుడు ప్రధాని మోడీ ఇలా సమాధాన మిచ్చారు. "చిన్నపుడు ఆరెస్సెస్ శాఖకు వెళ్ళేవాడిని. నేను అక్కడ చాలా విషయాలు నేర్చుకున్నాను. అక్కడ చాలా విజ్ఞానాన్ని ఇచ్చే ఆటలు ఉండేవి. ఆటలోనే నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ నేర్చుకునే వాళ్ళం. ఉదాహరణకి ఒక ఆట తీసుకుందాం. మేమందరం చుట్టూ గుండ్రంగా కూర్చొనేవాళ్ళం. మా శిక్షకుడు ప్రతి వాళ్ళని తనకి కుడి వైపు కూర్చున్న వాళ్ళలో ఉన్న ఒక మంచి లక్షణం చెప్పమని అడిగేవాడు. ఇది చూడటానికి చాలా సాధారణమైనదిగా ఉన్నా, దీనివలన మనలో ఒక మంచి లక్షణం కలుగుతుంది. అది మన పక్కన ఉన్న వాడిలో మంచి లక్షణాన్ని గుర్తించడం. అలాగే బాధ్యతను నేర్పే ఆటలు, అన్నీ మన సాంప్రదాయకమైన ఆటలే. అలాగే యోగ



నాకు ఎక్కువ ఆసక్తిగా ఉండేది. యోగాతో ఎక్కువ శారీరక వ్యాయామము జరిగేది. సాధారణంగా నేను ఒంటరిగా ఆడే ఆటలు కంటే అందరితో కలిసి ఆడే ఆటలు ఇష్టపడతాను. ఒంటరి ఆటల వల్ల శారీరక వ్యాయామం ఉంటుంది. కానీ ఇలా అందరితో కలిసి ఆడే ఆటల్లో ఎన్నో విషయాలు నేర్చుకుంటాం. నాయకుడిని అనుసరించడం, సర్దుబాటు చేసుకోవడం, మన సహచరులను అర్థం చేసుకుని, కలుపుకుని పోవడం ఇవన్నీ తెలుస్తాయి. అందుకే సామూహిక ఆటలు మంచివి". అని సమాధానమిచ్చారు మోడీ. ప్రధాని సమాధానం ద్వారా ఆరెస్సెస్ శాఖలో చిన్న చిన్న ఆటల ద్వారా పిల్లల్లో దేశభక్తి, సంస్కారాలు, వ్యక్తిత్వ నిర్మాణం ఎలా జరుగుతుందో అవగతమౌతోంది. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ★

## పాఠకుల నగారా

నేను రెగ్యులర్‌గా పత్రికలు చదువుతాను. కానీ నెలనెలా వచ్చే హిందూనగారా కోసం ఆతృతగా ఎదురు చూస్తాను. హిందూ నగారాలో వచ్చే వార్తలు, విశ్లేషణలు రెగ్యులర్ మీడియాలో కనిపించకపోవడమే అందుకు కారణం. జాతీయ వాద రచనలకు అసలు సిసలు వేదిక హిందూనగారా.

**– కొణిజేటి శివరాం ప్రసాద్, నెల్లూరు**

# సామాజిక సమరసతా వేదిక అధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

**రా**ష్ట్ర వ్యాప్తంగా సామాజిక సమరసతా వేదిక అధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 128వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలలో అనేక మంది విద్యార్థులు, వివిధ సంస్థలకు చెందిన సామాజిక కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ★

నెల్లూరు జిల్లా గూడూరులో



నెల్లూరు జయభారత్ హాస్పిటల్‌లో




కడపలో




కర్నూలు జిల్లా నంద్యాలలో



కడపజిల్లా బద్వేలులో



నారీ నగారా

# అమ్మకు చేదోడవలేమా?

-పులిగడ్డ రాధాదేవి

“ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు ఉంటారని” పెద్దలు చెప్పారు. ఇది మనందరికీ తెలిసిన విషయమే. ప్రస్తుత సమాజంలో స్త్రీలు అన్ని రంగాలలో అభివృద్ధికి సహకరిస్తూ తమ వంతు పాత్రను చక్కగా పోషిస్తున్నారు. ప్రతి సంవత్సరం “మహిళా దినోత్సవం” కూడా ఘనంగా నిర్వహిస్తున్నాం. ఆ రోజంతా ఎంతో ఉత్సాహంగా ఎన్నో కార్యక్రమాలు, ఉపన్యాసాలు ఉత్తేజ పరిచే వాతావరణంలో జరుగుతాయి.

సాధారణంగా కొన్ని ప్రత్యేక పదాలను మనమంతా వింటుంటాం. స్త్రీ స్వేచ్ఛ, సాధికారిత ఇలా ఎన్నో విషయాలను అందరం చర్చించి అందరికీ అన్నీ ఇవ్వబడ్డాయని తీర్మానించి ఇక విశ్రాంతి తీసుకుంటాం. మరి ఇది నిజమేనా? ఆలోచించాలి.

ఈ దశాబ్దంలో మహిళలు ఎన్నో కీలకమైన రంగాలలో పనిచేస్తూ, అత్యున్నత స్థాయి లో నిర్ణయాలు తీసుకుంటూ విజయాలను ఆస్వాదిస్తున్నారు. సాధారణ ఉద్యోగాలతో పాటు సైనిక దళాలలో కూడా మహిళలు విజయవంతంగా పని చేస్తున్నారు. మహిళలను ఉన్నత పదవులలో నియమించడం ద్వారా ప్రభుత్వాలు కూడా వారిని ప్రోత్సహించటం ఒక శుభ పరిణామం.

అయితే ఇటీవల సామాజిక మాధ్యమాలలో కొన్ని ఆసక్తికరమైన అంశాలు చర్చించ బడ్డాయి. వాటిలో ఒకటి ఉన్నత స్థానాలలో పనిచేసే మహిళా ఉద్యోగులు వారి సహ పురుష ఉద్యోగుల కంటే ఎక్కువ శ్రమ, ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు అనేది. దీనికి ప్రధాన కారణం వారు తమ ఇంటికి సంబంధించిన బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలనూ నిర్వహిస్తూ ఉండటం వలన వారు కొంత అధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. తరచుగా ఇలా జరగడం వారి శారీరక మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తోంది. ఎందుకంటే, ఇంటి బయట మహిళలు ఎన్ని రకాల బాధ్యతలు నిర్వహిస్తున్నా, ఇంట్లో వారికై కేటాయించిన కొన్ని పనులు తప్పనిసరిగా ఉంటాయి. సాధారణంగా చిన్నపిల్లలు, వృద్ధుల సంరక్షణ, ఇంటి నిర్వహణ, ప్రత్యేక సందర్భాలను నిర్వహించడం, అతిథులను ఆహ్వానించడం, ఆదరించడం ఇలా చాలావరకు పనులను మహిళలు బాగా చేస్తారని వారికే అప్పగించడం జరుగుతూ ఉంటుంది.ఇది వారిపై మరింత ఒత్తిడిని పెంచుతుంది. మరి దీనికి పరిష్కారం ఏమిటి? ఎలా ఈ సమస్యని అధిగమించడం.?

దీనికి సమాధానం మన ఇంట్లోనే ఉంది. మహిళా సాధికారత అంటే కేవలం వాళ్లకి అవకాశాలు ఇవ్వడం మాత్రమే కాదు. వారికి తోడుగా నిలిచి సహకరించాలి. ఈ విధానం మన ఇంటి నుండే మొదలవ్వాలి. అది ఎలా అంటే, ఉదాహరణకి ఒక ఉద్యోగిని అయిన మహిళ మన ఇంట్లో ఉన్నప్పుడు, ఇంట్లోని ఇతర సభ్యులందరూ ఆవిడని కాస్త కనిపెట్టుకుని చూడటం.

పసిపిల్లలు ఉన్న సందర్భంలో, అత్తమామలు లేదా తల్లితండ్రులు,భర్త వారి సంరక్షణలో పాలుపంచుకోవడం మంచిది. ఎదిగే పిల్లలు ఉన్న సందర్భంలో వారిని జాగ్రత్తగా చూసుకోవడం,వారి పనులలో కావలసిన సహాయాన్ని చేయడం కుటుంబ సభ్యులలో ఎవరైనా చేయవచ్చు.

మరి కాస్త పెద్ద పిల్లలు ఉన్న ఇంట్లో వారిని కూడా ఇంటిపనులలో భాగస్వాములను చేయాలి. ఇంటి బాధ్యతలు ఈ పెద్ద పిల్లలకు తెలియడం వల్ల భవిష్యత్‌లో వారు బాధ్యత కలిగిన వ్యక్తులుగా ఉండటమే కాక తమతోటి వారితో స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉంటారు.

ఇలా ఆలోచిస్తే మహిళా స్వేచ్ఛ, మహిళా సాధికారత మన కుటుంబ జీవన విధానంలో ఒక భాగంగా ఉంటుంది. దీనివలన ఆ ఇంట్లో పెద్దలు,పిల్లలు అందరూ సహృదయం,దయ, విశాల దృక్పథం కలిగిన వ్యక్తులుగా ఉంటారు. ఇలాంటి కుటుంబ వాతావరణం ఆ ఇంటి గృహిణికే కాదు అందరికీ ప్రశాంతతని ఇస్తుంది. కుటుంబ సహకారం ఉన్న మహిళలు ఖచ్చితంగా మరింత మెరుగైన పనితీరును ప్రదర్శిస్తారు. ఇది దేశాభివృద్ధిలో కూడా ఎంతో అవసరం. కాబట్టి ఇకనుండి ఈ కోణంలో కూడా ఆలోచించి, సరైన నిర్ణయం తీసుకుందాం. మరి మీరేమంటారు? ★

## వైభవంగా శ్రీ రామ శోభాయాత్ర




గుంటూరులో

పవిత్ర శ్రీ రామ నవమి సందర్భంగా శ్రీ రామ ఉత్సవ సమితి అధ్వర్యంలో గుంటూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. గుంటూరు వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ షుమారు 15 కిలోమీటర్లు సాగి అయ్యప్పస్వామి దేవాలయం వద్ద ముగిసింది. మండే ఎండను కూడా లెక్క చెయ్యకుండా వేలాది భక్తులు ర్యాలీలో పాల్గొనడం గమనార్హం.

**మచిలీపట్నంలో:**

శ్రీ రామనవమి సందర్భంగా మచిలీపట్నం పుర వీధులలో ఘనంగా శోభాయాత్ర జరిగింది. వేలాది భక్తులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ★



మచిలీపట్నంలో

## అబుదాబిలో తొలి హిందూ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

దుబాయ్ : యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుదాబిలో తొలి హిందూ దేవాలయ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. వేలాదిమంది భారతీయుల సమక్షంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో బోచసన్‌వాసి శ్రీ అక్షర్-పురుషోత్తమ్, స్వామినారాయణ్ సంస్థ (బీఏపీఎస్) అధిపతి మహంత్ స్వామి మహారాజ్ గర్భగుడి నిర్మాణం కోసం పునాదిరాయి వేశారు. అబుదాబి-దుబాయ్ ప్రధాన రహదారి సమీపంలో 14 ఎకరాల విస్తీర్ణంలో ఏడు అంతస్తులుగా ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు. ★

**చిన్నారి నగారా**

## చిన్నారుల్ని తూనీగల్లా ఎగరనిద్దాం

- పెరుగు సుజనారామం


**బా**ల్యం ఎంత బాగుంటుందీ! ఎగిరే తూనీగలాగా, విరిసి మెరిసే పువ్వులాగా!! భావి నిర్మాతలైన పిల్లలు అత్యంత శక్తివంతులు. కానీ పిల్లలలోని శక్తిసామర్థ్యాలని గుర్తించేంత శ్రద్ధ పెద్దలలో కొరవడింది. హనుమంతుడి సామర్థ్యాన్ని సీతాన్వేషణ సమయంలో గుర్తుచేసినట్లుగా ప్రతి చిన్నారిలోని సామర్ధ్యాల్ని గుర్తు చేయాల్సిన బాధ్యత,అవసరం తల్లిదండ్రులదీ, ఉపాధ్యాయులదీను.

ఈ ప్రంపచంలో ఎవరూ ఆకాశంలో నుండి ఊడిపడలేదు. తల్లి గర్భంలో తొమ్మిది నెలలు రూపుని సంతరించుకునే ఈ భూమ్మీదకి వచ్చారు. అప్పటి నుండే మొదలవుతుంది జీవితం. పడిలేచే పసిబిడ్డకి నడక నేర్పినట్టే నైతిక విలువలను నేర్పడం ఇక్కడే మొదలవ్వాలి. పాజిటివ్ దృక్పథం వైపే అడుగు వేయించాలి. ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి. ఎప్పుడయితే పిల్లలలో పాజిటివ్ ఆలోచన మొదలవుతుందో అక్కడే విజయానికి మెట్లు మొదలవుతాయి.

ఉపాధ్యాయులు, పెద్దలు తరచూ వాడే పదం "యూజ్ లెస్ ఫెలో" ఈ విశ్వంలో పనికి రానిదంటూ ఏమీ లేదు. ఎవరూ లేరు. చివరికి చెదపురుగులు కూడా చెక్కను పిండి పిండి చేయగలవు. కాని మనం చిన్నారులతో ఇలాంటి మాటలు మాట్లాడటం ద్వారా వారిలో నిరాశని నింపేస్తున్నాము. పెరుగుతున్న పోటీని తట్టుకునేలాగా, పులికి ఆహారంగా మారకుండా పరిగెత్తే జింకలా తయారుచెయ్యాలి. ఈ సమాజంలో ఆహారం కోసం వేటాడే పులుల వంటి సమస్యలు వలయంలా ఉంటాయి. వాటిని ఛేదించుకునే శక్తిని పెంచేలా చిన్నారులను పెంచగలగాలి. ప్రతి వ్యక్తి జీవితంలో బాల్యం ఒక అమూల్యమైన ఆస్తి. అందుకే అద్భుతమైన, అందమైన బాల్యాన్ని బాల్యంగానే చిన్నారులకిద్దాం. మార్కులు తగ్గినందుకు, ఎంసెట్‌లో అర్హత పొందలేక పోయినందుకు కృంగిపోయే స్వభావం కాదు కావలసింది.పిల్లల్ని మన చుట్టూ ఉన్న విశాలమైన సంతోషకరమైన ప్రపంచాన్ని చూడనిద్దాం. ఎప్పుడైతే ప్రకృతితో, మనుష్యులతో అనుబంధాన్ని పెంచుకుంటారో చిన్నారులు అప్పుడు స్వేచ్ఛగా ఆలోచించగలుగుతారు. వారు చేయాలనుకున్న ప్రతి పనిని ఎంతో సంతోషంగా ఇష్టంగా చేయగలుగుతారు. అదే వారి విజయానికి నాంది. ★

## భారత ప్రభుత్వ సార్వభౌమత్వం పైన దాడి. అబ్దుల్లా - ముఫ్తీ ల పై తగిన చర్య తీసుకోవాలి - విశ్వ హిందూ పరిషత్

**ము**గ్గురు మాజీ ముఖ్య మంత్రులు, నేషనల్ కాన్ఫరెన్స్ మరియు పీ.డీ.పీకి చెందిన ప్రముఖ నేతల పై విశ్వహిందూ పరిషత్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తూ, వీరి పై తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ నేతలు తరచూ చేస్తున్న భారత వ్యతిరేక వ్యాఖ్యలు మరియు బెదిరింపుల వలన కాశ్మీర్ లోయలోని అధిక సంఖ్యాకులు అయిన ముస్లిములు మరియు అల్ప సంఖ్యాకులైన ముస్లిమేతర వర్గాల ప్రజల మధ్య పెరుగుతున్న వైషమ్యాలను ఉటంకిస్తూ విశ్వ హిందూ పరిషత్ యొక్క ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఎన్నికల సంఘం అధికారులను కలిసి తమ ఆరోపణలను



తెలియజేసింది.. వీ.హెచ్.పీ యొక్క అంతర్జాతీయ అధ్యక్షుడు, అడ్వకేట్ శ్రీ ఆలోక్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటైన ప్రతినిధి బృందం ఎన్నికల సంఘంతో మాట్లాడుతూ, జమ్ము కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా మరియు మెహబూబా ముఫ్తీ లు పాకిస్థాన్ చేతిలో కీలు బొమ్మలుగా మారి ఆర్టికల్ 370 మరియు 35Aలపై తరచూ కాశ్మీర్‌లోని అధిక సంఖ్యాకులు అయిన ముస్లిం ప్రజలను రెచ్చగొడుతూ అక్కడి వాతావరణాన్ని ఉద్దేశ్య పూర్వకంగా, ప్రణాళికా బద్ధంగా మరింత కఠిన ముస్లిం సంప్రదాయాలకు అనుగుణంగా మార్చాలనే కుటిల యత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాక ఆదర్శవంతమైన ఎన్నికల విధానాన్ని ఉల్లంఘిస్తున్న వీరిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ★

Postal Registration No:VJ/152/2017-19 RNI No. 52882/93
Date of Printing : 28-04-2019-Date of Posting : 06-05-2019 - Pages: 8

చందాదారులుగా చేరండి! చేర్పించండి
హిందూనగారా సంవత్సర చందా రూ. 50
మీతో పాటుగా మరి కొంతమందిని
చందాదారులుగా చేర్పించండి.
SBI PrajasakthiNagar, VJA
SB A/C No. 10032482732
IFSC Code : SBIN0007899
పంపవలసిన చిరునామా
మేనేజర్
**హిందూనగారా**
మాధవసదన్, కాళేశ్వరరావు రోడ్,
విజయవాడ-520002.

Published by : Tulasi Surya Prakash, on behalf of Hindu Nagara and Printed at : Vanaja Graphics, 33-21-13/A, Chuttugunta, Vijayawada - 520 002. Printer & Editor : P.V.Sri Rama Sai., Cell : 9848076295. If undelivered please return to Madhavasadan, Kaleswara Rao Road, Governerpet, Vijayawada - 520002.